క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. అలాగే సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పూలు, నూతన చీరతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఎండీకి సత్కారం



డాక్టర్ జీబీ రావును సత్కరిస్తున్న బీజేపీ నాయకుడు రాజబాబు

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీబీ రావును బుధవారం విశాఖలో బీజేపీ జిల్లా మెంటార్, హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడు రాజబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో ఒక హోటల్లో బస చేసిన డాక్టర్ రావును కలిసి కాసేపు మాట్లాడారు. అనంతరం ఆయనను సత్కరించారు.

జిల్లా పరిషత్‌లో ముగ్గురు ఉద్యోగులకు పదోన్నతులు




ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర సూచనల మేరకు ఈ పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారిలో ఎస్వీహెచ్ఆర్ స్వామికి రావికమతం మండల పరిపాలనాధికారిగాను, వీఆర్ రాజేశ్వరికి విశాఖపట్నం పరిపాలనాధికారిగాను, వేణుగోపాల్‌కు డుంబ్రిగుడ మండల పరిపాలనాధికారిగాను పదోన్నతి కలిపించారు. తమ ఉద్యోగులకు పదోన్నతి కల్పించడం పట్ల ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన కింది కేడర్ల ఉద్యోగులకు కూడా త్వరితగతిన పదోన్నతులు కల్పించ వలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదనరావు, జెడ్పీ యూనిట్ ప్రెసిడెంట్ పీవీవీఎస్ మూర్తి, పరిపాలనాధికారి రాము పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నసమారాధన

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయం ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర మారిటైం బోర్డు మాజీ చైర్మన్ కాయల వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి అన్నదానం ప్రారంభించారు. అంతకు ముందు ఆయన శాంతిస్వరూపిణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి మీదా ఉండాలని ఆకాంక్షించారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మాలధారులకు అన్నప్రసాదం వడ్డించారు. కాయల సూరారెడ్డి, బోసు, ట్రస్టు సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దోమల దండు.. బాధలు మెండు



దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో పాతనగరవాసులు పెద్ద సంఖ్యలో జ్వరాల బారిన పడుతున్నారు. మురికివాడలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో పారిశుధ్యానికి సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. అయితే అలా జరగకపోవడం వల్ల ఇక్కడి చాలా ప్రాంతాలు అపరిశుభ్రంగానే దర్శనమిస్తుంటాయి. దీంతో ప్రజలు పలు రోగాలతో ఇక్కట్ల పాలవుతున్నారు.



పద్మానగర్‌కు ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్

ఫాగింగ్ ఎక్కడ?
దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా.. ఎక్కడో ఓ చోట ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తక్షణమే మలేరియా విభాగం సిబ్బంది లార్వా నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- పాతనగరంలో పెరుగుతున్న జ్వరాలు
- పరిస్థితిని దిగజారుస్తున్న అపారిశుధ్యం
- అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయని అధికారులు

డాబాగార్డెన్స్: పాతనగరంలోని అనేక ప్రాంతాలు జ్వరాల గుప్పిట్లో చిక్కుకుంటున్నాయి. పెరుగుతున్న దోమల సంతతి పుణ్యమా అని జ్వరాల జాడలు అన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా దోమలు హోరెత్తుతున్నాయి. మురికివాడలు అధికంగా ఉండే పాతనగరంలో ఇప్పటికీ ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. అయితే సిబ్బంది స్పందన సక్రమంగా లేపోవడంతో సమస్యలు జటిలమవుతున్నాయి. ఈ ప్రాంతంలో దోమల నివారణకు మలేరియా విభాగం అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతుండడంతో ఎక్కడికక్కడ దోమలు పెరిగిపోతున్నాయి. దోమల వల్ల జ్వరాల బారిన పడుతున్నామని పలువురు చెబుతున్నారు. దోమల నియంత్రణకు మలేరియా విభాగం అధికారులు చేపట్టే చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

రంగంలోకి కమిషనర్ దిగినా..
దోమలు విజృంభిస్తూ.. నగర ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఇటీవల రంగంలోకి దిగినా ఫలితం లేకుండా పోయింది. దోమలు ఎలా విజృంభిస్తాయి.. ఎలా గుడ్లు పెడతాయి.. ఇలా ప్రతిరోజూ ఏదో వార్డులో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. దిగువ శ్రేణి అధికారుల లోపమో.. సిబ్బంది అలక్ష్యమో.. లేదా ప్రజల అవగాహన లోపమో తెలియదు గానీ.. గత సారి కన్నా ఈ ఏడాది దోమల బెడద ఎక్కువైంది. ఫలితంగా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. అందుకు నిదర్శనమే.. పీహెచ్‌సీలు.. కేజీహెచ్‌లో నమోదవుతున్న కేసుల సంఖ్య.





స్టేడియం రోడ్డులో అపారిశుధ్యం

అపరిశుభ్రతకు నెలవు..
పాతనగంలో ఫెర్రీరోడ్డు, చిలకపేట, పద్మానగర్, తారకరామానగర్, రామకృష్ణావీధి, పండావీధి, కొబ్బరితోట, కల్లుపాకలు, భీమ్‌నగర్, కన్వేయర్‌బెల్ట్, కొత్త అగ్రహారం, కొత్త జాలారిపేట, రెల్లివీధి, కోడిపందేల వీధి, మీది రెల్లివీధి, వాడ వీధి వంటి మురికివాడలు ఉన్నాయి. వీటిలో అధిక భాగం గెడ్డలను ఆనుకుని ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న కాలువలు దాదాపు మూలకు చేరుకున్నాయి. కాలువలను శుభ్రం చేయకపోవడం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మురుగు నీటిలో దోమలు పెరుగుతున్నాయి. యాంటీ లార్వా ఆపరేషన్ జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. గతంలో మలేరియా విభాగం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందులు పిచికారీ చేసేవారు.

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4, 5 పరిధిలో గల వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్–4 పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, జగదాంబ వాణిజ్య సముదాయం, పాతబస్టాండ్ ఫేస్–2, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్డు సైడ్) ఫిష్ మార్కెట్లకు మూడేళ్ల కాల పరిమితికి అద్దెకిచ్చేందుకు ఈ నెల 14 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట జరుగుతుందని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. జోన్–5 పరిధిలో గల 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1, అలాగే 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణం రోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్ సైడ్ మార్కెట్, కంచరపాలెం రోడ్డు సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్లకు ఏడాదికి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు ఈ నెల 16 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి. రాము తెలిపారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయ పని రోజుల్లో పర్యవేక్షకులను సంప్రదించవచ్చని తెలిపారు.

పార్థివదేహాలపై అవగాహన



వైద్య విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రవేశించిన 2024–25 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులకు పార్థివ దేహాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు శరీర దానం ఆవశ్యకత గురించి వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ సంస్థ తరఫున గూడూరు సీతామహాలక్ష్మి, కన్యాకుమారి, అట్లూరు జ్యోతి, పి.వెంకటరాజు పార్థివదేహాలను ఆంధ్రా మెడికల్ కాలేజీకి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిశోర్, ప్రొఫెసర్ రాధిక, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేఖ, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ సుధీర్, డాక్టర్ దినేష్, డాక్టర్ నీరజ, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం-2024 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీసీ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఇంటరాక్ట్ క్లబ్స్ ఆఫ్ వీసీసీ బాలల దినోత్సవం–2024 పోస్టర్‌ను బుధవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్ విశాఖపట్నం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్ట్ క్లబ్స్‌లో ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఉన్న 135 క్లబ్స్‌లో బాలల దినోత్సవం పోటీలు నిర్వహించనున్నట్టు రోటరీ క్లబ్ విశాఖ ప్రెసిడెంట్ వినయ్‌గాంధీ తెలిపారు. ప్రపంచ ఇంటరాక్ట్ వీక్ సందర్భంగా బాలల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 14 వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ ఏడాది సర్వీసు అబౌ సెల్ఫ్ అనే థీమ్‌తో క్లబ్ లీడర్స్, వలంటీర్ల పిల్లల కోసం అనేక కార్యక్రమాలు ప్లాన్ చేసినట్టు చెప్పారు. అందులో బాలల దినోత్సవం ఒకటన్నారు. వీసీసీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రమాప్రభ మాట్లాడుతూ బాల్యం చాలా విలువైనదని, అది పిల్లలకు అందివ్వడం, పిల్లలు సమష్టిగా నిర్వహించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఫలితంగా ఒకే ప్రాంతంలో ఉన్న పిల్లల మధ్య స్నేహం, పరస్పర సహకారం, సేవా భావం పెరుగుతున్నాయని తెలిపారు. సెలబ్రేటింగ్ ది జాయ్ ఆఫ్ చైల్డ్ హుడ్ అనే నినాదంతో బాలల్లో శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంచే క్రీడలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వయస్సుల వారీగా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌గా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఏదైనా ప్రాంతంలో బాలల దినోత్సవం నిర్వహించాలనుకునే వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9347205549, 9392993742 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీసీసీ నుంచి ఎల్లాజీ, సునీత, భవానీ, మణి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వాసుపల్లి ఆర్థిక సాయం



దుర్గాప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: నియోజకవర్గ ప్రజలకు తానెప్పుడూ అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డులో ఇటీవల మృతి చెందిన పుర్రి దుర్గాప్రసాద్ పెద్దకర్మ సందర్భంగా ఎమ్మెల్యే ఆ కుంటుబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రతి వారికీ భరోసాగా ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించేదెవరు?



భూపేష్‌నగర్‌కు వెళ్లే దారిలో కుప్పగా వేసిన పూడిక

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు భూపేష్‌నగర్ వద్ద కాలువల్లో చెత్త పెద్ద ఎత్తున దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్య విభాగానికి చెందిన బాబీకార్ట్ ద్వారా కాలువల్లో పూడికలు తొలగించి కుప్పగా పడేశారు. దీంతో దుర్వాసన రావటంతో పక్కనే గల వినాయక గుడికి వచ్చే భక్తులతో పాటు, దుకాణాల యజమానులు, కొనుగోలుదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ సిబ్బందిని వివరణ కోరగా తడి చెత్త తొలగించడం కష్టం కావడం వల్ల తొలగించలేదని, చెత్త తడి ఆరాక తొలగిస్తామని చెబుతున్నారు. మెయిన్‌రోడ్డు మీద చెత్త పేరుకుపోవడంతో త్వరగా తొలగించాలని దేవాలయానికి వచ్చే భక్తులు కోరుతున్నారు.

జీతాలు ఇవ్వాలని 104 సిబ్బంది వినతి



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మహారాణిపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విశాఖలోని 104 సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని వాపోయారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలన్నారు. సీఐటీయూ నేత మణి సహకారంతో 104 సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తాతబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, కోశాధికారి ప్రకాష్, 104 ఉద్యోగులు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు.

కుటుంబం చెంతకు బెంగళూరు వ్యక్తి



వెంకట రమణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా సంస్థ సభ్యులు

సీతమ్మధార: మానసిక వ్యాధి నుంచి కోలుకున్న ఒక వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏయూటీడీ సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరులోని రామయ్య లేఅవుట్ హెగ్డహల్లికి చెందిన వెంకట రమణ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. సర్వం పోగొట్టుకున్న ఇతను ఆరు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఉండగా, ఏయూటీడీ జీవీఎంసీ నిరాశ్రయుల వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి కేర్‌టేకర్లతో కలిసి రెస్క్యూ చేసి ఇతన్ని వసతిగృహానికి తరలించారు. ఇతను రోజూ హరేయన బాబా మందిరానికి వెళ్లాలంటూ గొడవ చేసేవారు. ఇతను అభద్రతా భావంతో ఎవరినీ నమ్మేవారు కాదు. గత పదేళ్లగా మానసిక వ్యాధికి మందులు వాడకపోవడంతో వ్యాధి తీవ్రత ఎక్కువయింది. ఈ నేపథ్యంలో శ్రద్ధా బృందం ద్వారా వైద్యం, మందుల వాడకం వల్ల బాగా రికవరీ అయ్యారు. రమణ ద్వారా కుమారుడి చిరునామా తెలుసుకున్న ఏయూటీడీ, శ్రద్ధా సంస్థలు బెంగళూరులోని అతని కుమారుడు శ్రావణ్‌కుమార్‌కి అప్పగించారు. ఈ రెండు సంస్థల సభ్యులకు శ్రావణ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

పైవేటీకరణ దేశద్రోహంతో సమానం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ ప్రతినిధులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1318వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షను ఉద్దేశించి సీఐటీయూ సీనియర్ నాయకుడు వై. రాజు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల ఉద్దేశాలకు వ్యతిరేకంగా గత పది సంవత్సరాలుగా వ్యవహరిస్తుందన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని అన్నారు. నిజమైన దేశద్రోహం అంటే ఇదేనని తెలిపారు. ఎం. సుబ్బారావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యంతో వచ్చింది కాదన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో, 62 గ్రామాల ప్రజలు ఇళ్లు, భూములు, జీవనాధారమైన ఆస్తులని ధారాదత్తం చేస్తే వచ్చిందన్నారు. 61 మంది సీపీఎం నాయకులు తృణప్రాయంగా పదవులు త్యాగం చేస్తే వచ్చిన ఫలితమని తెలిపారు. దీన్ని ముట్టుకునే హక్కు బీజేపీకి లేదన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవటమే నిజమైన దేశభక్తి అన్నారు. మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ముఠా కళాసీ యూనియన్ నాయకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఏవీఎన్‌లో సర్ సీవీ రామన్ జయంతి



మినీ సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

డాబాగార్డెన్స్: భౌతిక శాస్త్రంలో నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ 136వ జయంతి గురువారం ఏవీఎన్ కళాశాలలో ఘనంగా నిర్వహించనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థిగా రామన్ జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. డాక్టర్ మల్లాది శివరాం, ఏయూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎస్. శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని గత రెండు రోజులుగా కళాశాల ప్రాంగణంలో వివిధ పాఠశాలలు, ఇంటర్మీడియర్, డిగ్రీ విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశమై వ్యాస రచన, క్విజ్‌తో పాటు పలు రకాల పోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు గురువారం కళాశాల ఆవరణలో నిర్వహించే రామన్ జయంతి కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. ఇదిలా ఉండగా బుధవారం కళాశాలలో మినీ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. నగర పరిధిలో గల వివిధ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపారు. ఏర్పాటు చేసిన మోడల్స్ తిలకించారు. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలు, సైన్స్ ఫెయిర్‌కు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తెలిపారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకట్రావు

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ముగింపు ఉత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. అంతే కాక వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, గ్రంథ పాలకుల సదస్సు, మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడు కూడా నిర్వహిస్తున్నామని వెంకట్రావు తెలిపారు.

'ప్రత్యేక' విద్యార్థులకు వైద్య సేవలు



వైద్యులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట: ప్రభుత్వ విజువల్లీ చాలెంజ్డ్ గరల్స్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు, ఓంకార్ అండ్ లయన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ది డెఫ్ లాసన్స్ బే కాలనీలోని విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు. ఓంకార్ అండ్ లయన్ ఎడ్యుకేషన్ సొసైటీలో 46 మందికి, ప్రభుత్వ విజువల్లీ చాలెంజ్డ్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 36 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. విశాఖపట్నం డాక్టర్ భారత్, డాక్టర్ కల్యాణి, డాక్టర్ భీమారావు, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ దీపక్ పాల్గొని వైద్య సేవలందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబుకాలనీలో వార్డు కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 19.50 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గత ప్రభుత్వంలో స్టాండింగ్ కమిటీలో మంజూరు చేసిన నిధులతో ఎన్నికల ముందు శంకుస్థాపన జరిగిందని, ఎన్నికల కోడ్‌తో పనులు ఆగిపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని పూర్ణిమ తెలిపారు. కూటమి ప్రభుత్వ నాయకుల ఉత్సాహంతో జీవీఎంసీ అధికారులు మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీ కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఐతి మధుబాబు, వంక సంజీవరావు, ఇంజినీరింగ్ ఏఈ సతీష్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.